తల్లిచేప

గోపి

పైన నీలినీలి ఆకాశం.... అక్కడక్కడ అప్పుడప్పుడే మొలుచుకొస్తున్న చుక్కలు, తెల్లగా పాలిపోయి వెన్నెట్లో మిలుకు మిలుకు మంటున్నాయి.... దుబ్బ కొట్టుకపోయిన పాదాలు అడ్డదిడ్డంగా నేలమీదపడుతున్నాయి. చెమటకు తడిసి ఎండిన చొక్కా పడపడమంటోంది ... పొద్దంతా ఎండ, ఉక్కపోత– వర్యాలేదు ఇప్పుడు కొద్దిగా గాలి తోలుతోంది....

దారికి అటుయిటూ పట్నం తుమ్మచెట్లు– కుడిపక్క చెరువుకట్ట– అంటే మేం ఊరికి దగ్గెరకొచ్చిన మన్నమాట డేవిడ్ తన ఆలోచనలో తనున్నాడు. "వెన్నెల చల్లగా హాయిగా ఉందికదూ!" అన్నాను. ఎక్కడన్నా నీళ్ళు దొరికితే మొఖంమీద చల్లుకొని, కాసిన్నితాగితే మరింత హాయిగా ఉండేదన్నమాట గుర్తొచ్చింది. డేవిడ్ నా మొదటి మాటవిన్నట్టులేదు. "ఇక్కడేదో చెరువున్నట్టున్నది. కాసిన్ని నీళ్ళు తాగిపోతే" అన్నాను మళ్లీ నేనే....

"ఊరు దగ్గరే.... ముందల మనపనిగావాలి" డేవిడ్ జవాబు

ఇద్దరం నడుస్తున్నాం .. నాకు ఇంకేదన్నామాట్లాడాలనే ఉన్నది. కాని, డేవిడ్ ఏం ఆలోచిస్తున్నాడో? పాపం డేవిడ్ వయసు ఇరువైమూడో అంతకన్న ఒకటి ఎక్కువో? ఈవయసులోనే ఇన్ని ఆలోచనలు, నాకులేవు.... నాఆలోచనలువేరు. చెట్టునుచూసినా, పుట్టను చూసినా ఏదో పలవరింత ... గునగునాయించుకునే మాటలు.

ఇద్దరం ఊరిబందుకొచ్చాం... ఎడం పక్క చిన్నచిన్న గుడిసెలు బహుశా అవి హరిజనుల గుడిసెలై ఉంటాయి– కుడిపక్క సర్కారు బావి– అలిశ్యంగా ఇల్లు

చేరిన ఇల్లాలొకామె అదరబాదరగా నీళ్లు చేదుకుంటోంది. ఆమె పక్కపిల్లలు అకలికి కాబోలు ఏడుస్తున్నారు. కొంచెం దూరంలో జెండా కనిపించింది. ఆశ్చర్యం. తెల్లగా ఆజెండామీద రాడికల్స్ అని రాసుంది. పోలీసులకు దానిమీద కన్ను బడలేదేమొ? నేనిట్లా ఆలోచిస్తుండగానే డేవిడ్ ఎడమపక్కకు తిరిగిండు. మేంసీదాపోతే అక్కడో చిన్న హోటల్ లాటి దున్నట్లున్నది. అక్కడ రేడియోలో తెలుగువార్తలొస్తున్నయి అక్కడ మనుషులు ఏ విషయం తెలియకుండా మాట్లాడుతున్నారు.

743

మేం గుడిసెల చూర్లక్రైనీడకింది నుండి. మలుపులు తిరిగి ఊరు చివరకొచ్చాం ఇంత సేపు ఎదురుపడ్డ మనుషులకు మొఖం పక్కకు బెట్టి డేవిడ్ నడవడం నేను గమనించాను.

మేం నడుస్తున్న వాడ గొల్లలవాడ అయ్యుఉంటుంది. మేకల అరుపులు, ఒకవిధమైన గదడ్‌గదడ్ వాసన రావడం కొండగుర్తు. అక్కడక్కడ మేకల పొదులున్నాయి. డ్రేవిడ్ అడ్డదిడ్డంగా ఉన్నగుడిసెలను వాకిళ్లలో కాళ్లబార జాపుకొని గడుక ముద్దలు మింగే మునుషులను తప్పించుకొని ఒక గుడిసె ముందాగిండు. అ గుడిసెకు తూర్పువైపు ఇంకోగుడిసెగోడ పడమటివేపు మరో గుడిసెగోడ ఉండి దాని కదే ఎడంగా ఒంటరిగా ఉన్నది. గుడిసెముందు వాసాలు దేలిన చిన్నగుడిసె ఉంది. అందులో కుక్కిమంచమున్నది. అగుడిసె ఛాతీ అంత ఎత్తేఉన్నది....

మా అడుగుల చప్పుడుకు ఒక స్త్రీ గొంతు బెదురుతూ "ఎవలాల్లు" అన్నది:....

"నేనే నవ్వా: డేవిడ్‌ను'' డేవిడ్

ముసలమ్మ పోలీసులనుకున్నదేమొ: గొంతుగుస్తపట్టి చిరాకికి చెయ్యడ్డం బెట్టుకొని గుడిసెలనుంచి బయటకొచ్చింది. ముసలమ్మ వెన్నెల సంగతి మరచిపోయి నట్లున్నది. దీపం మలిగిపోయింది.

"నువ్వా బిడ్డా సానొద్దులకు" దీపంకిందబెట్టి డేవిడ్ ఒళ్ళంతా పునికింది. నాకేసి ప్రశ్నార్థకంగా చూసింది. నేను ఏమి మాట్లాడాలో తోచలేదు. గుడిసె వెనుకవేపున్న చింతమీద కొంగలు కాబోలు రెక్కలు టపటపలాడించి ''కావురు కావురు''మన్నాయి

డేవిడ్ నాగురించి ఏమి చెప్పిందో నాకు వినపడలేదు

ఇద్దరం వంగి గుడిసెలోపలికి నడిచినం. గుడిసెచాలా చిన్నది. దండెంమీద, చిరిగిన పేగులు, గోడకు వేసినచాట మూలకు మట్టివంట పాత్రలు.... ఇంకోమూలకు కోళ్లగూడు ...

744

''అవ్వా సెమటకు ఉప్పుదేలి సిటసిట బెడ్తుంది''.... డేవిడ్

"పోరడు ఏడబోయిండో, బాయికాడికిబోయి జెట్న నీళ్ళుసేదుకత్త. మీరట్ల మాట్లాడుకుంట కూకుండుండ్లి" కుండ చేతిలోనికి తీసుకున్నది

''గీనాత్రి నీళ్ళెందుకంట ఎవలన్న అడుగుతె'' డేవిడ్

''ఆళ్ళింట్ల పిన్గె : లకుబోయి గిప్పుడే అచ్చిన్నంట'' అవ్వ వెళ్ళిపోయింది

డేవిడ్ వంటపాత్రలు తనిఖీ చేశాడు. గడుకెసులల సలిగడుక కొంచెమెఉన్నది అంగీలిడుసుకున్నాం.... అవ్వ నీళ్ళ కడువతోపాటు కొంగులో కాసంతపొడి గడుక తెచ్చింది.

మేమిద్దరం ఆఒక్క కుండెడు నీళ్ళతో మొఖాలు కడుక్కున్నాం. అవ్వ పొయ్యింటిచ్చింది. మోకాల్లమీద తలబెట్టుకొని అవ్వ పొయ్యిదగ్గర కూర్చున్నది. మేమిద్దరం కొంచెం దూరంలో సంచిబొంత పరుచుకొని కూర్చున్నాం.... ఇంతలోకి అవ్వ రెండోకొడుకు దుబ్బకాళ్ళతో గుడిసెలకొచ్చాడు. రెండు భుజాలు చిరిగిన అంగీ వేసుకున్నాడు. చెంపలమీద మాంసంలేక ఎముకలు తేలున్నాయి. కండ్లు మాత్రం చాలా చురుకుగా, చిత్రంగా ఉన్నాయి.

"గింతనాత్రిదనుక ఏడరాజ్జేలేలత్తివి"? అవ్వ. అది ప్రశ్నకాదు. కొడుకు జవాబు చెప్పలేదు. డేవిడ్కు లాల్సలామ్ చెప్పి పక్కనే కూలబడ్డాడు....

గడుక ఎసులలో నీళ్ల తుకతుకలాడటంతోటి మూతతీసి గడుకపోసి తెడ్డుతో కలిపి మంటదీసింది.

"ఈడికి నాలుగు పారీలచ్చిరి బిడ్డా! మేం దొంగలమైపోతిమి" అవ్వ....

వచ్చిందెవరో డేవిడ్కు అర్థమయ్యింది.

"ఏమంటరవ్వ''?

''పీరీంకట్టైతీర్గఉన్న బక్కోడంటడు''

''ముసలిముండ మంచిమంచోళ్ల మన్నయిపోతండ్లు. మీ ఊళ్లో గ రామ్రెడ్డి నూ_వా? ఇదంత కానిదిపోనిదని చప్పుడు చెయ్యక ఉంటలేడా? నీకొడుకే దండి

మొగోన్నని ఎగురుతుండు. కనిపిస్తే కాల్చెయ్యమని ఆర్డరు.... పిచ్చిదానా అనికి లేకున్నా నీకన్నా జ్ఞానం ఉండాలెనే ఎర్రిగొల్లోనికి ఏమెరికనే!'' అన్నడు....

''నువేమన్నవ్''

"ఏమంట బిడ్డా! అన్నిగన్నగని ఆనిరాతనుగన్ననా?" అన్న ...

"ఆనెంటొచ్చిన గుమ్మటంలాంటోడు ముండా నాత్రి నీయింటికత్తడంటగదా పోలీసోని కండ్లుగప్పి ఎంతకాలం తప్పకుంటడే" అన్నడు

"అత్తె ఏడుంటడు నాదేమన్న అర్రలున్న మేడామిద్దా పట్టుకోరాదుండ్లి అన్న నేను...."

"మా అవ్వను బుదరకిత్తండ్లు" అన్నడు ఆమె చిన్నకొడుకు

ఆతరువాత గడుకదించింది.... గిలేటుపళ్లెలిద్దరికి పెట్టింది. "కాదు అందరం తలాకొంత తిందామన్నడు డేవిడ్", అదే మంచిదనిపించింది. కాని పళ్లేలున్నట్టులేదు డేవిడ్ గడుక కుండమీది మూకుడు తీసుకున్నాడు. ముసలవ్వకొడుకు గిన్నె తెచ్చుకున్నాడు. చలిగడుక ముసలవ్వ పెట్టుకుంటనంటే తలాకొంత పంచుకున్నాం చింతకాయ తొక్కు....

అందరం తింటున్నాం. నేను తింటూతింటూ ముసలవ్వకేసి చూశాను. చాలా ఎత్తుమనిషి నల్లగా, కాయగాసిపోయిన దేహం, చెక్కుకుపోయిన చెంపలు, చిరిగిన గుడ్డలు గాజుకండ్లు మొత్తానికి ఆముసలితల్లి కష్టాలుపడి బాగా అలిసిపోయినట్టున్నది. కాని ఆకష్టాలనే తలుచుకొని తలుచుకొని ఏడుస్తూ, దిగాలుపడి కూచున్న మనిషిలాగా లేదు.... బతుకున్నంత వరకు కష్టాలుంటాయని ఏదైతె అదైతదని తెగించి ముందుకు నడిచే వీరయోధురాలులాగా అన్పించింది. ఏమో నా అనుభవం, వయసు ఆమెను అంచనా కట్టడానికి సరిపోవేమొ అనుకున్నాను....

అవ్వ మాఇద్దరి ముఖాలకేసి చూసింది. ఆచూపులో ఏముందో నాకు తెలియలేదు. డేవిడ్ చలిగడుకకానిచ్చి ఉడుకుగడుక ఊదుకుంటు తింటాండు.

746

'బిడ్డా కోప్పడరుగదా!' అన్నది అవ్వ

డేవిడ్ తిండాపి "అట్లంటవేందవ్వా!"

"కాదు కొడుకా నామనుసుల ఎప్పటినుంచో ఓమాటున్నది, ఎవలనడుగాలో దోత్తలేదు...." అవ్వ చెయ్యికడుక్కొని మాకు మరింత వడ్డించింది.... పొయిల పుల్లొకటి తీసుకొని దాన్ని అటుయిటూ తిప్పింది- మళ్ళీ పొయిలేసి ఊదింది. గుప్పున మంట లేచింది.

"బిడ్డా జెరంత సెవునబెట్టు- మా అయ్యవ్వకు నేను పెద్దబిడ్డను- నా ఎను- ఇద్దరినికని మాఅవ్వ సెల్లిపోయింది. గసిన్నతనంలనే ఇంటిపెత్తనమంత మీదబడ్డది. పెండ్లయ్యేదనుక సిడెంసేపు రికాంలేకుంట కట్టవడ్డ. పెండ్లయినంక గీడగదె పుల్లెందల కట్టమో నిట్టూరమో కలిసి ఎల్లబోత్తామనుకుంటె దేవుని గుల్లెరాయివడ పొల్లగండ్లు కండ్లు దెరువకముందే ఆయినె మందకాడిది మందకాన్నే పాముగుట్టి సెల్లిపోయిండు- ఇగబిడ్డా సీతసెరలచ్చినయ్. మంద మన్నయిపోయింది. ఇద్దరు పోరగండ్ల కడుపుకు గట్టుకొని సాదుకచ్చిన. తిన్ననో? కంటినిండ నిదురేతిసిన్నో ఎండల్లవానల్ల సలిల ఉపాసాలుప్పిల్లున్ననో గ భగవంతునికెరుక. ఏదో ఏగిచ్చుకచ్చిన. పిలగండ్లకు రెట్ట ముదిరింది. భగవంతుడా గంపంత కన్నుబెట్టుకొని ఏడున్నవో? ఇకనైన నా కట్టాలు కడతేరినయనుకున్న. బిడ్డా! నావొంసెజిగినచ్చింది. నాకండ్లల్ల నీల్లింకినంక నా సెత్తల నెత్తురు సచ్చింది.... నా సెట్టెత్తు కొడుకు మిమ్మలకలిసిండు...." అవ్వ కంఠం వనికింది. ఆ ముఖం చూసి నాకళ్లల్లోకికూడా నీళ్లూరినయ్....

అవ్వ మాట్లాడలేదు. డేవిడ్ అడుగలేదు.... మా తిండ అయిపోయింది.. అందరం బయటకొచ్చి చిన్నగుడిసెలో కూర్చున్నాం....

అవ్వ కళ్లొత్తుకుంటూ వచ్చి కింద కూలబడ్డది. ఆమె ముఖంమీద గుడిసెకప్పు రంధ్రంగుండా వెన్నెలచారపడుతోంది

"పేదోల్లు సుఖపడాలె కాదనను- పేదోల్ల రాజ్జెం రావాలె- నాకన్నా ఎవల కెక్కువ సంబురం.... దొరల దుట్టితనం బోవాలె- ఎందుకంటే నాసిన్నతనం నుంచి దొరల తన్నులు తాపులుపడ్డ.... అకటికి సచ్చిన- బిడ్డా గదానికి నాకొడుకే కావన్నా! రవ్వంత సుకం గీ ముసలిముండకు గావన్నని కోరుకునుడు తప్పాబిడ్డా!" అవ్వ ఏడుస్తోంది....

747

"వద్దవ్వా నువ్వేడువద్దు- నీకష్టాలు, కన్నీళ్లు- కాదుకాదు ప్రపంచంలో కష్టాలు కన్నీళ్లు ఉండొద్దనే నీచిన్నారి కొడుకులం పోరాడుతున్నాం ఔను తేం ఇనుప మూతి కొదుం మధ్యనే ఉన్నాం. తుపాకులు, టాంకులు ఎన్ని ఉంటేనేంది ... ఇన్నేళ్లు పశువులకన్నా హీనంగా చూతబడ్డవాళ్ళు తెగించి పోరాడుతున్నాం. మనం పొట్టచేతబట్టుకొని సంవత్సరాల తరబడి దిక్కుకొచతుండా తిరిగితిరిగి వేసారిపోయాం" నాకు మనసులో ఎన్నో మాటలు ఇలాంటివే పోటెత్తుతున్నాయి. నేను పుస్తకాల నుండి అవ్వదగ్గరికొచ్చినవాన్ని- ఈమాటలు అవ్వకు తెలుస్తాయా? ఔను అవ్వ కోరే దేమిటి? రవ్వంత సుఖం- ఈముసలి వయసులో కాసంత విశ్రాంతి.... అడిగవ్వా! ఆమె అలిసిపోయింది.... విసిగిపోయింది. విప్లవం కావాలి- కానిఈబీదతల్లి కొడుకే ఆ విప్లవానికి కావాలా?

"ఎవలను వాళ్లే విముక్తం చేసుకోవాలే అవ్వ- ఎవలకష్టాలకు వాళ్లే తెగించి పోరాడేలే అవ్వ?" అనాలనుకున్నాను... ఈ మాటలకర్థమేమిటి? మాటలకోసంగింజు కున్న- అవ్వ కర్థమయ్యేలాగా ఎట్లాచెప్పాలి?

డేవిడ్ ముఖం ప్రశాంతంగా ఉన్నది. బీడి ముట్టించాడు....

అవ్వ రెండోకొడుకు అవ్వ మాటలకు కదిలిపోయినట్లున్నాడు. అతనికి ఆ మాటలకు ఆవాటుకావాలి అన్నట్టుగా ఉన్నాయి అతని చూపులు....

బీడి అయిపోయింది- "అవ్వా నాకు కాసంత పనున్నది. నేను పోయొత్త మాట్లాడుకుంట కూకోండ్లి...." డేవిడ్ గుడిసెలకై నీడల్లో కలిసిపోయాడు.

నేను ఇరుకునబడ్డాను.... అవ్వను ఆవాత్తిసినుంచి తప్పించేందుకు ఏదో వొకటి చెప్పాలనుకున్నాను. ఏదీ చెప్పలేకపోయాను. డేవిడ్ పదినిమిషాల తరువాత తిరిగొచ్చిండు....

కాల్లూపుతూ మంచంమీద కూర్చున్నాడు- సన్నగా గొనుగుతూ "వెన్నెల రాత్రిల్లో వలలో అన్నాలొచ్చిండ్లు' అంటూ పాడాడు.... డేవిడ్ గొంతు బాపుం 748 హఠాత్తుగా పాటాపి "అవ్వా ఏదన్న కాత్రిం చెప్పరాదు.... నువ్వేం చెప్పుతవులే నేనే చెప్పుత...." నవ్వుతూ.

"మీకు ఏడుపురాదా బిడ్డా!" అవ్వ తేలికగా విట్టూరుస్తూ....

అదేమి పట్టించుకోకుండా "వినవ్వా! అయింక నన్ను అంటవ్.... తమ్మి నువ్వు సుత వివరా!" అంటూ మొదలేసిండు....

డేవిడ్ గొంతు మారిపోయింది. సారథికాడు కథ చెప్పినట్లుగా రాగయుక్తంగా 'అవ్వా! అన్నిచేపలు బుట్టినట్లుగానే సందమామచేప పుట్టిందట- పుట్టంగనే దానికి బండెడు కష్టాలచ్చినయట- సేపకట్టం సేపదనకు- అది ఈదరాని మడుగులన్ని ఈదిందట- కాలువల్లనుంచి వాగుల్లకు, వాగుల్లనుంచి సెరువుల్లకు- అవ్వా! అది తిరిగి తిరిగి వేసారిపోయింది. ఎక్కడసూసినా గదేబతుకు- దాని పక్క సేపలన్ని వేటాడబడ్డయి. వలల సిక్కేటియి సిక్కినయ్- నీళ్ళకింద, ఉసికెకింద ప్రవాహం కిందా నచ్చేటియి నచ్చినయ్.... అయినా మొండిచేప కాలానికి కట్టానికి ఎదురునిలిసి బతికింది- వేటగాళ్ళకు చిక్కకుండా తప్పిచ్చుకున్నది- దానికి ఇద్దరు కొడుకులు. ఇద్దరు కొడుకుల బట్టుకొని ఏడికిబోతె ఆడికి ప్రమాదం వెంటబడగా తప్పించుకుంటూ చివరకు ఓమడుగు చేరింది.' డేవిడ్ ఆపిండు.

అవ్వ ముఖం వికసించింది.... అవ్వ రెండోకొడుకు డేవిడ్ పక్కకొచ్చి కూర్చున్నాడు....

"అవ్వా! మరింక ముసలిచేపకు అలసటొచ్చింది....'భగవంతుడా! నాబతుకంతా తిరుగడమే సరిపోయింది. ఇప్పటికన్నా ఈముసలిదానికి కొనంత సుకం ఇయ్యి తండ్రీ!' అనిరోజూ భగవంతునికి మొక్కకునేది. కాని భగవంతుడు ముసలిచేప మొర ఆలకించలేదు మడుగులో నీళ్ళు రోజుకొన్ని ఎండిపోసాగినయ్. ముసలిచేప పెద్దకొడుకు తల్లితో తిరిగి కొంత లోకజ్ఞానం సంపాదించాడు. ఎప్పటికైనా ఈ మడుగు ఎండిపోగలదని, మడుగులో జీవితం ప్రమాదమైనదని ఎప్పుడో ఒకప్పుడు చేపలమీద వల విసరబడుతుందని గ్రహించాడు.... కనుక మడుగును కాలువను కలిపే నీళ్లధార ఎండిపోకముందే బయటపడటం మేలని గ్రహించి తల్లికి చెప్పాడు.

749

తల్లిచేప విరక్తిగా "బిడ్డా! నాబతుకంతా తిరిగి తిరిగి అలసిపోయాను.... నేనెంత అలిసిపోయానంటే ఈమడుగులో నుండి ఒక్కడుగు వేయజాలను.... బిడ్డా

బయట ఏముందో? ఇంతకన్నా సుఖంఏదలేదు.... నాబతుకే అందుకు సాక్ష్యం.... మనబోటి వాళ్ళకు ఏడికిబోయిన ఏడే మానుకలు. నువ్వు ఈముసలి వయసులో నన్ను విడిచిపోవద్దు” అని ఏడ్చిందట....

అప్పుడు పెద్దకొడుకు “అవ్వా ఎండకాలంపోయి వానకాలం వస్తుంది.... మబ్బులు కుదురుకుంటాయి.... కాలం మారినట్టుగానే మన బతుకులు మారుతాయి. ఇక్కడుంటే మనం గిలగిలతన్నుకొని చావాల్సిందే” అన్నడట....

“నువ్వు కోరి ప్రమాదాన్ని తెచ్చుకుంటున్నావ్ బిడ్డా!” తల్లిచేప.

‘రెండోకొడుకు చేప ఏమనలేద్దా?’ అవ్వ రెండోకొడుకు ప్రశ్నించాడు.

‘ఏమనలేదట– అబుల్లిచేపకు తల్లిమాట బాగానే కన్పించింది– అన్నమాట బాగానే కన్పించింది– ఎటూతేల్చుకోలేక పోయిందట’ దేవిడ్.

‘అమ్మయ్య’ రెండోకొడుకు నిట్టూర్చిండు....

‘మరింక విధిలేక తల్లిని తమ్మున్ని విడిచి పెద్దకొడుకు తనదారి తాను చూసుకున్నడట– మడుగులోనుంచి వెల్లిపోయిండట– మడుగులన్నీ తిరుగాలి, వాగులన్నీ తిరుగాలి– చేపలజాతికి ప్రమాదంలేని మంచిబతుకు ఎట్లాగన్నా కనుక్కోవాలి. ఈ పనిలో అవసరమైతే ఏదైనా చేయాలి– తన తల్లికి సుకం కావాలి....’

కాలం గడిచిపోతోంది మడుగును కాలువను కలిపే నీటిధార ఎండిపోయింది. ముసలిచేప భగవంతుల్ని ప్రార్థిస్తూనే ఉన్నది. దానిమనుసులో పెద్దకొడుకు అన్నమాట ‘అవ్వా మనమీద ఏక్షణాన పరిమాదం వల రూపంలో పడుతదో?’ అనుకున్న ప్రమాదం రానేవచ్చింది. ఒక బెస్తవాడు మడుగులో వల విసిరాడు.... అప్పుడు రెండోకొడుకు చేపకు ఏమి చేయాలో తోచలేదు. అన్న చెప్పినమాటవిని– అన్నతో వెళ్లిపోతే బావుండేది. కాని తల్లిమాటమీద నిలబడ్డాడు. అయినా ఏదైనా ఉపాయం చూడాలి వలను బయటనుండి పళ్ళతో కరిచిపట్టుకున్నాడట– బెస్తవాడు వలనుతీసి తేటనీళ్ళల్లో కడిగిండట– ముసలిచేప రెండోకొడుకు నీళ్లకాలువలో కలిసి అన్నను వెతుక్కొంటూ వెళిప్లోయాడట.

750

అవ్వా! అలిసిపోయిన ముసలిచేప, బతుకంతా కష్టాన్నే చూసినతల్లిచేప, రవ్వంత సుకం కావాలని రోజుభగవంతున్ని కొలిచిన తల్లిచేప- కొడుకు పసికట్టిన ప్రమాదాన్ని తెలుసుకోలేక బెస్తవాడికి చిక్కింది....

అవ్వా! నీసుఖం దు:ఖం తొలిగేదారి నాకు నీకొడుకే చూయించిండు ... నీకు నీకొడుకె చూయించిండు... నువ్వన్నట్టు అదారిలో పోకపోతే ఇనుపమూతి కాకులు మనకు సుకాన్నిస్తయా? నీకొడుకేకాదు ... అవ్వా నువ్వూ రావాలెనమ్మా"

డేవిడ్ లేచినిలుచున్నాడు.... నాకు అక్కడి వాతావరణాన్నిగాని, అమ్మ ముఖంలోని భావాన్నిగాని, ఆమెరెండోకొడుకు ముఖంలోని ఆలోచనలనుగాని చూడటానికి భయమేసింది....

మేమిద్దరం గుడిసెలుదాటి ఊరిబయటకొచ్చాము.... కట్టచివరికొమ్మకు అయిదుగురు రైతులు కూర్చుండి ఉన్నారు.... అంతకన్నాముందు ఆఅయిదుగురిలో ఒకడు మాకు కొంచెందూరంలో ఎదురుచూస్తూ కనిపించాడు.... మమ్మలిద్దరిని మిగతానల గురిదగ్గరికి తీసుకవెళ్లాడు.... తరువాత ఆరైతులతో డేవిడ్ చాలా రాత్రయ్యేదాకా మాట్లాడాడు....

* * *

రెండు నెలలు నేను అవ్వనుగురించే మరిచిపోయాను.... రెండు నెలల తరువాత ఒకనాడు పత్రిక చదువుతుండగా నేను డేవిడ్‌తో కలిసివెళ్లీన ఊరుగురించి రిపోర్టు వచ్చింది.

ఆ వూళ్లో పోలీసులు క్యాంపు బెట్టారట- ఆక్యాంపులో జనాన్ని "మంచి నీళ్ళడుగుతే మూత్రం పట్టి బలవంతంగా తాగించడం, అన్నం అడిగితే మలం తినమని మరుగుదొడ్డికి తీసుకవెళ్లటం, రోలర్ ట్రీట్‌మెంటులకు గురిచేయటం తలకిందుల వేలాడదీసి గంటల తరబడి అలాగే వుంచటం- ఒకరిచేత మరొకరిపై మూత్రం పోయించడం, వలయాకారంగా కూర్చుండబెట్టి ఒకరిచేత మరొకరిని చెప్పులతో కొట్టించటం, నగ్నంగా వుంచటం.... చిత్రహింసల పరంపర తర్వాత....

అవ్వను అరెస్టుచేసి "నీకొడుకు బాంబుల్ని ఎక్కడ దాచాడో'' చెప్పమని పోలీసులు వేధించారు. తనకు ఆవిషయం తెలియదని అవ్వ మొత్తుకున్నా వినకుండా క్యాంపుకు తీసుకవెళ్ళి విపరీతంగా కొట్టారు. ఆమె స్పృహతప్పి పడిపోవడంతో తలకు గాయమయ్యింది. దెబ్బలు భరించలేక ఆమె ఆత్మహత్య చేసుకోవడానికి ప్రయత్నించి స్పృహకోల్పోయింది.... హాస్పిటల్‌లో చేర్చారు".

నా మనసు విలవిలలాడింది. డేవిడ్ చెప్పిన మూడుచేపలకథ గుర్తొచ్చింది. ఇంతలొందరగా డేవిడ్‌కథ నిజం కాగలదని నేనూహించలేదు.

దెబ్బలుతిన్న అవ్వనూహించుకుంటూ నేను హాస్పిటల్ గేట్లోకి అడుగుపెట్టాను అప్పటికి రోగుల బంధువులు హాస్పిటల్ నుంచి ఇళ్లకు తిరిగిపోతున్నారు ... చూడ వల్సిన సమయము అయిపోయిందన్నట్లుగా లావుపాటి వార్డుబాయ్ గంట ఊపుతున్నాడు.

బెదురుబెదురుగా నేను స్త్రీల వార్డులోకి అడుగుపెట్టాను.... అవ్వను కనుక్కో-వడం అంత కష్టంకాలేదు.... నేను అవ్వ మంచందగ్గరికి వెళ్ళేసరికి కంపలాటి తల గల ఒకపేదస్త్రీ అవ్వపక్క నిలబడిఉన్నది....

అవ్వతలకు తెల్లటి గుడ్డలు చుట్టబడిఉన్నాయి. ఎడంచేయికి సిమెంటు పట్టి వేసున్నది....

"అవ్వా నేనొచ్చాను....'' నాగొంతు నాకేచిత్రంగా....

అవ్వ కళ్లు విప్పింది.... బాను నన్ను గుర్తుపట్టింది ... నరాలుతేలిన కుడిచేయి ఎత్తి నన్నునిమికింది.... నాకు దుఃఖం వస్తోంది.... కాని ఏడవకూడదు .. ధైర్యంగా ఉండాలె అలిసిపోయిన అవ్వకు నాదుఃఖం కనిపించకూడదు

"బిడ్డా! నీళ్ళదార తెగినమడుగు ఎండిపోతది.... సేపలు నీళ్లల్లనే బతుకుతయి వెనక్కి రావద్దనిచెప్పు.... నాతీర్గ ఒలల సిక్కొద్దనిసెప్పు.... పేదదాన్ని, బతుకంత కట్టాలు పడ్డదాన్ని.... బిడ్డా ముసలిదాన్ని 'వొలలబడ్డ. పెద్దోడు చెప్పింది[illegible]లే.... పెద్దోడుకల్సిన నీళ్ళధారలనే సిన్నోన్నిన్ని పొమ్మనిచెప్పు.... నేను బతికిబట్టకడుతే.. మీ యవ్వ మరింక ఎన్నడూ వొలల సిక్కదని చెప్పు...."

అవ్వ చెక్కిళ్లమీద కన్నీళ్లు.... పక్కనున్న పేదస్త్రీ ఏడుస్తోంది....

నేను వెనక్కి తిరిగి అవ్వసందేశాన్ని మోసుకొని బయటకు నడిచాను....

సవారీ

తుమ్మేటి రఘోత్తమరెడ్డి

(ఇదేపేరుతో ఒకకథ 1981 నవంబర్ సృజనలో వచ్చింది. బావపురది అర్జంటుగా రమ్మవిరాస్తే బండిమీద సవారీఅయి బయల్దేరాడు ప్రతాపరావుదొర. బండి ముందు పరుగెత్తాల్సిన చాకలి తనభార్య అప్పుడే ప్రసవించటంతో ఏదన్నా అవసరం వస్తుందేమోనని తాను ఇంటిదగ్గరేవుండి తనకొడుకుని పంపిస్తాడు. వాడు చిన్నపిల్లాడు వేగంగా పరిగెత్తే గిత్తలకన్నా వేగంగా పరిగెత్తటంలో అలసిపోతాడు. మెల్లిగా పరిగెడితే గిత్తలకాళ్ళకింద నలిగిపోతాడు. ఇంతలో జనసమూహం, ఆసమూహంలో ఎర్రజెండాలు వూరిపొలిమేరల్లో కన్పిస్తాయి ప్రతాపరావుదొరకి. ఎదురుగా వచ్చే వాణ్ని అదేమిటని అడుగుతాడు. అమీటింగు సంఘపోళ్ళది అనిఆతడు చెప్తాడు. దొరకొంచెం ఆలోచించి చాకలికుర్రాణ్ని తనతోబాటు బండెక్కమంటాడు. వాడు నమ్మలేనట్టుచూస్తాడు. దొరకోపంగా "ఎక్కరా గాడిదీ-ఎక్కు, ఎక్కుమంటె చెవులు ఇనపడ్తలేవ్?'' అంటాడు. అకుర్రాడు బండీఎక్కి భయంభయంగా కూచుంటాడు. బండి మళ్లీ 'సవారీ' మొదలెట్టింది....)

యిందాక బండెనుక వురికిచ్చుకొని యిప్పుడెందుకు బండ్లె ఎక్కించుకున్నడో ఓదెలుకు తలకాయ పలగ్గొట్టుకున్నా అర్థంగాలేదు. ''సీయవ్వ.... వూరుదాటినంక ఎక్కిచ్చుకుంటడనుకుంటి!.... తాల్లల్ల గౌండోళ్ళు, కల్లు దాగచ్చినోళ్ళు సూత్తరు గదాని తాళ్ళదాటినంక ఎక్కిచ్చుకుంటడనుకుంటి, అదీపాయె, తోటలు పెరండ్లు పేన్లు సెల్కలుదాటినా ఏడటక్క వురుగుకనబడక పెయినా బండెక్కిచ్చుకోకపాయె. ఆఖరికి వూళ్ళకు వూళ్ళుదాటితిమి అం....ముందుకుకుమనె ఎనుకకురమ్మనె మొసనక దమ్మువక వురికినా బండిపొంటై అందకపాయె! కోడెలెట్లున్నయి? మొద్దులతీరుగ జలిసి గుర్రాల తీరుగ వురుకబట్టె.... వురుకకఏంజేత్తయి? పనాపాటా? బగ్గతినుడు సవారి పెనాలు చేసుడు నాగలానట్టా! వాటికి పన్లేదు యీలంజకొడుక్కు పనిలేదు.... తినుడు తిరుగుడు